**శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi**

ఏప్రిల్ 2023 | April 2023

ఈ సంచికలో ... | IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 105వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 8 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 18 |
| **4.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 26 |
| 5. | Water on a Lotus Leaf | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 11 | V Krithivasan | 38 |
| 7. | Mudaliar Paati | | 42 |
| 8. | Ramana Yoga Sutras | Sri Krishna Bhikshu | 45 |
| 9. | Ramana's Words | | 48 |
| 10. | What is meant by Samsara? | | 50 |


**Events in Sri Ramana Kendram in April 2023**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 18th - Shri Bhagavan's 73rd Aradhana
2. 26th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# బలాన్ని ఇవ్వగలిగినది భగవంతుడే

డా॥ కే.యస్. గారి 105వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

నిత్యజీవితంలో మనం ఎంతో మందితో కలిసి మెలిసి వుంటాం. కాని మన పరిమితమైన మనస్సులతో ఎదుటి వారిని పూర్తిగా తెలుసుకున్నామని, అవగాహన చేసుకున్నామని చెప్పలేం. అయినప్పటికి మన కేంద్రంలో ఎన్నో విషయాలను గురించి మాట్లాడతాం. భగవాన్‌ను గురించి, గాంధీజీని గురించి, లేదా శంకరాచార్యులను గురించి ఎన్నో చెబుతాము. కాని మనం అన్నవన్నీ పూర్తిగా సత్యాలేనని ఖచ్చితంగా చెప్పలేం. మనం చెబుతున్నవి అన్నీ నిజాలేనన్న నమ్మకంతో ఇవన్నీ చెప్పబడుతుంటాయి.

ఆ మాటకొస్తే గణితంలో ''పై'' యొక్క విలువను నిర్ణయించడం జరగలేదు. ఏవో కొన్ని లెక్కలూ, ప్రాతిపదికలను అనుసరించి విలువను కడతాం. దాని ఆధారంగా వంతెనలు ఎన్నో ఇంజనీరింగ్ పనులు, మొదలైన కార్యక్రమాలను ఎన్నింటినో జరుపుతున్నాం. భగవంతుని కృపతో అవి అన్నీ నిజమైన అంచెనాలన్న నమ్మకంతో ముందుకు పోతుంటాము. కాని పరిమితులకు లోబడిన జ్ఞానం. ఒక వైపు అవి మన స్ఫురణలోనే వుంటాయి.

## సత్యమే దేవుడు

మహాత్మాగాంధీ తాను ఋషినని ఎప్పుడూ చెప్పుకోలేదు. తాను ఒక మునిలాగ మారాలని ప్రయత్నం చేస్తున్న రాజకీయవేత్తనని

చెప్పేవారు. దేవుడు ఒక సత్యం అనేదాని కంటే, సత్యమే దేవుడు అని తన అభిప్రాయం అనేవారు. సత్యాన్ని నిరంతరం పాటించే వారు. బాధామయ జీవితాన్ని గడపాల్సి రావడం ఆయన విషయంలో తప్పనిసరి అయింది. మొత్తం మీద ఆయన విజయవంతులయ్యారా అంటే, కాలేదనే చెప్పాల్సి వస్తుంది. జీవిత కాలమంతటా అహింసనే పాటించి, బోధించిన గాంధీజీ తుపాకీ కాల్పుతో చనిపోవాల్సి వచ్చింది. అలాగే ఏసుక్రీస్తు శిలువ వేయబడ్డాడు.

మనం భగవాన్‌ను ఒక వ్యాధి నుండి రక్షించమని ప్రార్థిస్తే, ఒకటి రెండుసార్లు అది నయం కావచ్చు. మనం భగవాన్ లేదా దైవకృపను మంచి జరగడమనే భావనతోనే ఆలోచిస్తే ఏదో ఒక రోజు అలా జరగకపోవచ్చు. మనం చనిపోవచ్చు. ఆ రోజున కృప కలుగలేదని అనడం సబబా? భగవాన్ కృప అన్నది ఎల్లప్పుడూ ప్రవహిస్తూనే వుంటుందని భగవాన్ నిర్ద్వంద్వంగా చెబుతూ వచ్చారు. అది నిరంతరమైనది. దేవుడు తలవకపోతే ఒక గడ్డిపోచ కూడ కదలదని గాంధీజీ చెప్పేవాడు. మనం భగవంతుడు ఏమి చేయాలి, ఏమి చేయకుండ వుండాల్సింది అని ఆలోచిస్తాం.

గాంధీజీ నిష్ఠతో కూడిన జీవితాన్ని గడిపారు. తాము ఈశావాశ్యోపనిషత్‌లోని మొదటి శ్లోకాన్ని ఎప్పుడూ మరచిపోలే మనేవారు. ఈ మొత్తం విశ్వంలోని ప్రతి అణువులోనూ భగవంతుడు వ్యాపించి వున్నాడని దాని సారాంశం. త్యాగబుద్ధి చేతనే ఈ ప్రపంచాన్ని సరిగా అనుభవించగలమని గాంధీజీ అభిప్రాయం.

తన జీవితాన్ని చివరి వరకు అలాగే గడిపారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఆయన త్యాగబుద్ధిని ఎంతో మెచ్చుకుంది. ఈ శతాబ్దపు అతి గొప్ప వ్యక్తిగా వర్ణించింది.

**భేదం లేని మాట, చేతలు**

మనం మన అవసరాలు తీర్చుకోవడంలో క్షణం తీరిక లేకుండ గడుపుతుంటాము. అందుకే దయాగుణాన్ని అలవరచుకోవడం భగవాన్ మనకు ప్రసాదించాలి. మహర్షి ఒక తత్వవేత్త కాదు. ఆయన మాటలు, చేతల మధ్య ఏ మాత్రం భేదం వుండేది కాదు. సరోజినీ నాయుడు తరచు ఈ ప్రపంచంలో ఇద్దరు అసాధారణ వ్యక్తులని, ఒకరు గాంధీజీ, మరొకరు భగవాన్ రమణ మహర్షి అని అనేవారు. తన అద్వితీయమైన శైలిలో 'గాంధీజీ మనల్ని ఎప్పుడూ విశ్రాంతి తీసుకోనివ్వడు, దేశం కోసం ఏదో ఒక పనిచేస్తూ వుండమనే వారు. ఆయన అత్యంత చురుకైనవారు. ఇక మహర్షి మనసుకు విశ్రాంతిని ఇవ్వమనేవారు' అని వ్యాఖ్యానించేవారు.

బాహ్యంగా మనం చురుకుగా వుండవచ్చు గాని మనసుకు కల విశ్రాంతిని ఇవ్వడం చాలా ముఖ్యం. మరో మాటలో చెప్పాలంటే, నీవు ఒక పనిముట్టు మాత్రమేనని గుర్తించాలి. గాంధీజీ కూడ మరో రీతిలో ఇదే చెప్పేవారు. స్వయంగా నేను దీనిని చేశానని అనుకోకుండ భగవంతుడు ఇలా చేయడానికి కావలసిన బలాన్ని ఇచ్చాడని భావించాలి.

పలు సందర్భాలలో నేను చేసేది శూన్యం, అసాధారణమైనవి ఏమీ చేయలేనని అనుకోవాలని కూడ గాంధీజీ చెప్పేవారు.

మొట్టమొదట గాంధీజీని మహాత్ముడని సంబోధించినది డా॥ ఆనీ బెసెంట్ అన్న ఒక బ్రిటీష్ వనిత. కాని తాను అనల్పుడినని అతి సామాన్యుడినని ఆయన అనేవారు. 'గాంధీయిజం' అంటూ ఏమీ లేదని తాను క్రొత్తగా దేనినీ బోధించడం లేదని కూడ అంటూ వచ్చే వారు. సత్యమే దేవుడని అన్నది క్రొత్తగా నేను అనలేదు, ఎంతో మంది చెప్పారని కూడ ఆయన అన్నారు. రమణమహర్షిని విశిష్ఠ వ్యక్తి అని ఎవరైన అన్నప్పుడు, "అలాంటిదేమీ లేదు. శంకరాచార్యులు, లేదా ఫలానా ఇంకెవ్వరో ఇలా అన్నారని దాట వేసేవారు. నమ్రత అతి ముఖ్యమైన గుణం. ఎవరైన మనల్ని మెచ్చుకున్నప్పుడు మనం పొంగిపోవడం ఉచితం కాదు. దాని దుష్ప్రభావం పొగడిన వాళ్ళ మీద కాదు, మన మీద వుంటుంది.

**జ్ఞాని లక్షణం**

సదాశివ బ్రహ్మేంద్ర ఒక గొప్పజ్ఞాని. ఆయన బ్రూహి ముకుందేతి, మానస సంచరరే మొదలైన ప్రఖ్యాత సంగీత రచనలు చేశాడు. ఒక సందర్భంలో ఆయన పూర్వ సహాధ్యాయుడు ఒకరు "మనం కలిసి చాలా కాలం వున్నాము కదా; నీవేమో గొప్ప జ్ఞానివి అయ్యావు, ఇది ఎంతో అసాధారణ విషయం" అని అన్నాడట. కొన్ని క్షణాల పాటు సదాశివ బ్రహ్మేంద్ర సంతోషపడ్డాడు. అంతలోనే పొగడ్తకు తాను మనసును పూర్తిగా చంపుకున్నప్పటికి, ఒక చిన్న మెచ్చుకోలుతో నేను జ్ఞానినని మురిసిపోయాను. అందుకే భగవంతుని కృపకు పాత్రుడివైతే తప్ప, వ్యక్తిత్వాన్ని రూపు మాప లేము అన్న నిజాన్ని గ్రహించాడు.

అతి సామాన్య జీవితాన్ని గడుపుతున్న సదాశివ బ్రహ్మేంద్ర ఒక సందర్భంలో ఒక పొలం మధ్యలో తన చేతిని తలగడగా పెట్టుకుని పడుకున్నాడట. ఆ దృశ్యాన్ని గమనించిన ఒక గ్రామ వనిత అటువైపు వెళుతూ, ''ఇది చూడు, తాను ఒక జ్ఞానినని భావించే ఈయన తలగడ లేకుండ పడుకోలేక పోతున్నాడు'' అన్నది. అది వినిన సదాశివ బ్రహ్మేంద్ర చాలా సిగ్గుపడిపోయి ఆమె చెప్పిన మాటలో నిజం వుంది అని గ్రహించాడు. తన చేతిని తలక్రింది నుండి తీసి పడుకున్నాడు.

కొద్దిసేపటి తరువాత అదే స్త్రీ తిరిగి అటు వెళుతూ, ''ఓహో, ఈయన జ్ఞాని అనుకున్నాను. కాని ఇతరుల మాటలకు అంత సులభంగా ప్రభావితం అయ్యాడు'' అంటూ వెళ్ళిందట. అప్పుడు సదాశివ బ్రహ్మేంద్ర ''ఇదేమిటి; ఆమె ఒక సాధారణ గ్రామ వనిత అనుకున్నాము. కాని ఒక మంచి పాఠం నేర్పింది. మొదట ఆమె నేను సౌకర్యం కోసం తలక్రింద చేయి పెట్టి పడుకున్నాననింది. ఇప్పుడేమో నేను ఇతరుల విమర్శలకు ప్రతిస్పందిస్తున్నానని అనింది. అంటే నా మనసుకు స్థిరత్వం లేదు. ఎదుటివారి మాటలకు ప్రతిస్పందిస్తే మనం చేయాల్సిన కార్యాన్ని నిర్వర్తించలేము'' అన్న నిజాన్ని గ్రహించాడు.

సాధారణ జీవితంలో కూడ ఎందరో ఎన్నో వ్యాఖ్యానాలు చేస్తుంటారు. అభిప్రాయాలు ఇస్తుంటారు. మనం ఒక మంచి కార్యాన్ని ఖచ్చితమైన అభిప్రాయంతో నిర్వర్తించాలని నిశ్చయించుకున్నప్పుడు, అవతలి వ్యాఖ్యానాలతో సంబంధం లేకుండ ముందుకు సాగాలి. విమర్శలు వస్తూనే వుంటాయి. ఏది సరియైనదో దానిని అనుసరించాలి.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 60వ పద్య తాత్పర్యము

సనాతనమైనది, నిరంతరమై, నిబిడీకృతమైన (అంతటా నిండిన) సత్ బ్రహ్మమైన పరవస్తువే నేనని, నీవు ఎప్పుడూ ఆ ఏకాత్మ స్వరూపమునే ధ్యానించి చూడుము. ఇట్లు అన్ని వేళలా ఎవరొక్కడు ''అతనే'' నేనని భావించి, అచంచలముగా నిశ్చలముగా నుండునో, వాడు అమృతత్వమును పొంది పరబ్రహ్మ స్వరూపుడే యగును.

## వ్యాఖ్య

ఒక కాలమందుండి మరొక కాలము సందదృశ్యమై పోక, ఎప్పుడూ శాశ్వతముగ మారకుండ వున్నదే ''సనాతనమని'' చెప్ప బడుచున్నది. వేదములలో చెప్పబడిన కర్మలన్నియు సనాతన ధర్మము లనబడుచున్నవి. ఇవి అన్ని కాలములకు, అందరికి వర్తించునట్లుండును. ఈ సనాతన ధర్మములను పెద్దలందరు మన్నించి పూజించి ఆశ్రయించి మంచి నొందుచున్నారు.

లోపల బయట కొంచెమేని ఖాళీ స్థలములేక, అంతటా ప్రకాశించుటచే ''నిరంతర'' మని చెప్పబడుచున్నది. సత్ అగు ఆ బ్రహ్మమే ''నేను'' అని చెప్పబడు, ''సోహం'' అను మహా వాక్యముచే, అన్ని వేళలా భావించి, అచంచలముగా, అదే అయి నిశ్చలముగా వుండినచో, ఆ యోగి మృత్యువు లేని స్థితిని

పొందును. "అమృతత్వమును పొంది" అనగా మరణము లేని స్థితిని పొందుటయే యగును.

### 61వ పద్య తాత్పర్యము

ఓ మానినీ! ఎప్పుడూ సిద్ధముగా నున్న ముక్తి స్థితిని అందరు పొందుటకు జ్ఞానము యొక్క స్వరూప లక్షణము ఇటువంటిదని నాచేత యింతవరకు వివరింపబడినది. ఇప్పుడు ముముక్షువులగు సాధకులు ఆశ్రయించ వలసిన ఆచారములను చెప్పుచుంటిని. వీటిని సావధానముగా వినుము.

### వ్యాఖ్య

ఆచారములన్నవి, అనాదిగా మనలో వున్న వ్యవహారపు అలవాటులు. వీటినే పూర్వాచారములని చెప్పుచున్నాము. కుల ధర్మములను పాటించునపుడు కులాచారములనీ, మతముల సంబంధించిన నీతులు, లక్ష్యములు లేక శాస్త్రములు అనుష్టించు నపుడు మతాచారమనియూ చెప్పుచున్నాము. కాలాచారములు, దేశాచారములని ఈ విధముగా జ్ఞానసంపదలనబడు మతముల ఆచారములను జ్ఞానాచారమనియూ, శిష్యులు అనుష్టించువాటిని శిష్యాచారమనీ చెప్పుచున్నాము.

ఇక్కడ చెప్పబోవునది ముముక్షువులు అనుష్టించవలసిన ఆచారముల గురించి. ఒక లక్ష్యసాధనకు ఆచారములు కంచె వంటివి. అవి రక్షించు శక్తి గలవి. ఆచారముల వల్ల మనస్సు అదుపులో నుండి అచంచలమైన స్థితిలో నుండుటకు అనుకూల మగును. పైగా చిత్త శుద్ధిని కలిగించి, మనస్సును తేటపరచి ఆత్మ విచారణమునకు సాధకమగును.

లభించిన ముక్తిని జారవిడవకుండా యుండుటకు, కావలసిన అవసరమైన ఆచారములను ఇక చెప్పుచున్నాను. జాగ్రత్తగా శ్రద్ధగా వినుమని పరమేశ్వరుడు ఈశ్వరికి తెలుపుచున్నారు. ఆధ్యాత్మిక విద్యను అనుష్ఠించు ముముక్షువుల కొరకు కొన్ని ఆచారములను వేరుపరచి చెప్పుచున్నారు.

కొన్ని ఆచారములు దేహశుద్ధిని, కొన్ని చిత్తశుద్ధిని, కొన్ని వాక్శుద్ధినీ ఇచ్చి మనస్సు అంతర్ముఖమగుటకు తోడ్పడును. ఆచారములనిన, చేయవలసిన వాటిని చెప్పే శాసనములు. వ్యవహారమనిన అవి సాధించు అనుష్టానములు. ఈ ఆచార వ్యవహారములను బట్టి ఒకని నడవడికను తెలిసికొనవచ్చును.

## 62వ పద్య తాత్పర్యము

స్త్రీ జాతి రత్నమా! పుణ్యతీర్థ స్నానము, మంత్రములను జపించుట, నిత్యము చేయబడు హోమమూ, దేవతామూర్తుల పూజలు, తేజోమయమైన అగ్నియందు చేయబడు పవిత్ర కార్యములు మొదలగునవన్నిటినీ చక్కగ తెలుసుకొని అనుష్ఠించ వలసిన ఏ ఒక్క మార్గమూ, జ్ఞానాభ్యాసికి ఎప్పుడు లేవని నీవు తెలుసుకొనుము.

## వ్యాఖ్య

61వ పద్యములో అంబికకు, ఆచారములను చెప్పుదును సావధానముగా వినుము అన్న పరమ శివుడు, సాధకుడు ఆత్మ విద్యను పొందవలెనన్న యిచ్ఛతో, తీవ్రముగా ఏ ఆచారములను అనుష్ఠానములనూ చేయుచువచ్చునో వాటినన్నటినీ పట్టిక తయారు చేసి, వాటినన్నిటినీ కొంచమైనను శేషముంచక పూర్తిగ

వదలి వేయుటయే నీవు అనుష్ఠించవలసిన ఆచారమని చెప్పుచున్నారు.

ఆచారములన్నీ చిత్తశుద్ధి కొరకు, ఏకాగ్రతకు చెప్పబడినవి. మనసు తేటపడి, నెమ్మది నొంది ఆత్మ విచారణమును అనుసరించు జ్ఞానాభ్యాసికి యివన్నీ అవసరము లేదు. చెప్పవలె నంటే అవి అడ్డంకులేయగును. ఎందువలననగా ఆచార అనుష్ఠానములు బహిర్ముఖమైన కార్యములు. జ్ఞానాభ్యాసమో అంతర్ముఖమైనది లేక అంతరంగమైనది.

భూమిపై ప్రవహించు పుణ్యనదులైన గంగ, యమున వంటి నదులలో తీర్థస్నానములూ, గణపతి హోమము సమిధాదానం వంటి నిత్యదానములూ, పంచాక్షరి, అష్టాక్షరీ వంటి మంత్ర జపములూ, నిత్యమూ చేయబడు దేవతాపూజలూ వారికి (జ్ఞానాభ్యాసులకు) లేవు.

అంతేకాదు, నిత్యాగ్ని హోత్రులచే చేయబడు బ్రహ్మయజ్ఞము, వైశ్వదేవము (విశ్వదేవతలను గూర్చి చేసెడు హోమము), స్థాలీపాకము మొదలైన వాటితో విశేషముగా చేయబడు మహత్తరమైన వాజపేయాది యాగములాంటి ఉన్నతమైన హోమ కార్యములు బాగా నేర్చుకొని చేయవలసిన దేదియూ అతనికి అవసరము లేదు. అతను చేయవలసినది అంతయు వీటిపై మనసును పోనీయక, తన మనస్సును ఆత్మవిచారణము చేయుటలో నిమగ్నము చేయుటయే. జ్ఞానసాధకునకు పైన చెప్పిన ఏ సాధనము ఎప్పుడూ లేదని గ్రహింపుమని తెలుపుచున్నారు.

## 63వ పద్య తాత్పర్యము

ముక్తియందు ఇచ్ఛగల జ్ఞానాభ్యాసికి, నియమములూ, క్షేత్ర పీఠములోని మూర్తులకు జరుపు వందన స్తోత్రములూ, నామార్చనములూ, పితృ దేవతలకు చేయు పితృ కర్మలూ, భూమిపై ప్రసిద్ధమైయున్న పుణ్యస్థల తీర్థయాత్రలూ, మహిమలు గల పుణ్యవ్రతములూ, యివన్నిటినీ జ్ఞానాభ్యాసికి ఆలోచించి చూచినచో, వీటిలో ఏ ఒక్కటి అవసరము లేదే!

## వ్యాఖ్య

వేదాంత గ్రంథములలో పలురకములైన యమ నియమ ఆహార ఆసనాదులు విరివిగా జ్ఞానాభ్యాసికి చెప్పబడియున్నవవి. క్షేత్రముల గొప్పతనములనూ, ఆ క్షేత్ర పీఠములో గల మూర్తులనూ, వాటికి చేయబడు పూజాపునస్కారములు, నామార్చనములూ, యివి చేయవలసిన పద్ధతులూ పురాణములలో విస్తృతముగా చెప్పబడియున్నవి. భూలోకములో గల పుణ్యమైన గంగాది తీర్థ స్నానములను, మోక్షపురములని భావింపబడు, అయోధ్య, మధుర, మాయా, అవంతి, కాశీ, కాంచీ బదరి మొదలగు క్షేత్రాటనముల గురించియూ స్థల పురాణములు చెప్పుచున్నవి.

వంశపెద్దలు గురించి చేయు తిల తర్పణములు, తీర్థపిండ ములు, శ్రాద్ధాదులు మొదలైన పితృకర్మములు గురించి శాస్త్రములలో చాల విరివిగ చెప్పబడుచున్నవి. ప్రజలు విశేషముగా ఆచరించు వ్రతములైన మహాశివరాత్రి, వైకుంఠ ఏకాదశి, కృష్ణ జన్మాష్టమి, రామనవమి వంటి ఫలితములిచ్చు వ్రతములను

గురించి వ్రత కల్పములు చెప్పుచున్నవి. పుణ్యమైనవని తలచు వీటిలో ఏ ఒక్కటి కూడ, ఆ జ్ఞానాభ్యాసికి అవసరము లేదని ఆలోచించి చూచిన తెలియును.

మహిమలు గల పుణ్యవ్రతములు, చేసిన వెంటనే ఫలితము లిచ్చు వీర్యవంతమైనవి తేజోవంతమైనవి, సంతానము కొరకు చేయు పుత్రకామేష్టి యాగమము, శత్రువులను జయించుటకు చేయబడు సుదర్శన హోమము, వర్షము కొరకై చేయబడు వరుణ సూక్తజపము మొదలైనవి వీటిని చేసిన వెంటనే వాంచించిన ఫలములిచ్చునవి.

ఇవన్నియూ మనస్సుతో చేయబడు కార్యక్రమములు. అయితే అభ్యాసి చేయవలసినది మనస్సును తనలోనికి త్రిప్పి స్వరూపమును తెలిసికొనుటకు ప్రయత్నించుటయే. అందుచే యివి ఏవియూ అతనికి ఆత్మజ్ఞాన సాధనకు అవసరము లేదు.

## 64వ పద్య తాత్పర్యము

జ్ఞానాభ్యాసికి ధర్మ అధర్మములైన, పుణ్యపాపముల వల్ల కలుగు ఫలములు లేవు. విశేషముగ చెప్పబడు తిథులు, లోకులు అనాదిగా చేస్తూ వచ్చిన కర్మలూ అతనికి లేవు. కావున అన్ని రకములైన కర్మలను విడిచి వేయవలెను. లోకులచే అనుష్ఠింప బడు అన్ని విధములైన ఆచారములను వదలివేయవలెను.

## వ్యాఖ్య

లోకులచే చేయబడు విహిత కర్మలూ ఆశ్రమ ఆచార ధర్మములూ, సామాన్య ధర్మములైన పేదలకు సహాయము

చేయుట, పంచ చేరిన వారిని, ఆశ్రయించిన వారిని ఆదరించుట వంటి లోక ఆచారములను త్రోసివేయుము అని తెలుపుతున్నారు. అంతేగాక, అన్ని రకములైన ఆచారములన్నిటినీ మొత్తముగా తీసి వేయుము అని అనుచున్నారు.

## 65వ పద్య తాత్పర్యము

(తాను ఏ మతము నందు జన్మించియుండెనో, ఆ) మతాచార వ్యవహారములన్నిటినీ, కొంచెమైననూ అనుష్ఠించక వాటిని త్రోసి వేయవలెను. ఎందువలననగా అన్ని రకములైన ధర్మములు బంధములగును. కనుక పలురకములుగా తోచు సంకల్ప వికల్పములనూ, తాను పుట్టిన జాతిని, జాతి ధర్మములను, వాటి సంగములను దూరముగా త్రోసి వేయవలెను.

## వ్యాఖ్య

పుట్టుక అంటూ వచ్చినపుడే ఏదో ఒక జాతినో, మతమునో చేరియే పుట్ట వలయును. అట్లు జన్మించినవాడు, తాను పుట్టిన జాతి మత అనుష్ఠానములను అనుసరించియే జీవించుట సహజము. అది పారంపర్యముగ సహజమైనది, ఇట్లు వచ్చిన జాతిమత ఆచారములను కొంచెమైననూ అనుష్టించక త్రోసివేయు మని ఖచ్చితముగా చెప్పబడుచున్నది. ఎందువలననగా అవన్నియు అతనికి బంధము లగుచున్నవి. ఏ ఒక కర్మను చేసిననూ, ఆ కర్మ ఫలితమునకు అతను కట్టుబడి యుండును. కర్మబంధము అనుభవించిన తప్ప తీరదు. అనుభవించిన తర్వాత దానితో తీరునా? కానే కాదు. ఇంకనూ కర్మలను చేయనిచ్చి, అది అతనిని కర్మ సముద్రములో ముంచుతున్నది.

సత్సంకల్పములు సూక్ష్మమైనవి. కర్మలు స్థూలమైనవి. సత్సంకల్పములు కర్మలను ప్రేరేపించు సూక్ష్మ బీజములు. ముందు అతను సంకల్పించినవే కర్మలై ఈ రోజు ఫలములను అనుభవింప చేయుటకు వచ్చినవి. ఈ విధముగనే, పుట్టిన జాతికి, జాతి ధర్మములకు సంబంధించిన వాసనలు, వాటితోగల సంగములను వాసనలు, అతనికి ఇంకనూ జన్మలే యిచ్చుచున్నవి. అవి ఈ సంసార సాగరము నుండి ముక్తి తీరమును చేర్చవు.

**66వ పద్య తాత్పర్యము**

అణిమాది సిద్ధులూ, భూగర్భములో నిక్షిప్తమైన వస్తువులను చూపించగల శక్తిమంతమైన పాతాళాంజనము మొదలైనవి, రసవాద సిద్ధులూ, ఈ లోకములో ప్రత్యక్షముగా దొరకిననూ, వాటిని సాధకుడు మనస్సున పట్టించుకొనక, ఒదిగి తప్పుకొనవలయును.

**వ్యాఖ్య**

జ్ఞానాభ్యాసియగు సాధకునకు, సాధనలో పురోగమించక నిరోధించు వాటిలో సిద్ధులు చాలా అపాయకరమైనవి. వీటినుండి తప్పించుకొనినవాడే ముక్తి సిద్ధిని పొందగలడు. సిద్ధుల అద్భుత శక్తులకు వశముగాకుండ తప్పించుకొనుట చాల కష్టము.

అణిమ, మహిమ మొదలైన అష్ట సిద్ధుల వంటివే రసాయన సిద్ధులు. ఇవి శక్తివంతమైనవి. ఇవి పాతాళాంజనము, భూతాంజనము, చోరాంజనము అను మూడు రకములుగా చెప్ప బడుచున్నవి. దీని గురించే శ్లోకములో భూగర్భములో నిక్షిప్తమైన

వస్తువులను చూపించగల శక్తివంతమైన పాతాళాంజనము రసవాద సిద్ధులూ మొదలైనవియని చెప్పబడినది. భూగర్భములో నిక్షిప్తమైన నిధులను కంటికి చూపించునది పాతాళాంజనము. పంచభూతము లనబడు భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశముల గుణములను లొంగదీసుకొనునది భూతాంజనము. ఇతరుల కంటికి తెలియక గమనాగమనములు చేయుట, ఇతరుల కంటికి కానరానిది కనునట్లు చేయుట చోరాంజనము.

పచ్చటి చెట్టును మాడ్చుట, మాడిపోయిన చెట్లను పచ్చవిగా చేయుటలో నిపుణులు ఈ సిద్ధులు. ఇటువంటి సిద్ధులు తామే వచ్చిననూ సాధకుడు వాటిని పట్టించుకొనక పక్కకు తొలగిపోవుట చాలా ఆవశ్యమనునదే ఉపదేశము. పక్కకు తప్పుకొమ్మని ఈశ్వరుడే సాధకుని ఆజ్ఞాపించుచున్నాడు.

## 67వ పద్య తాత్పర్యము

ముందు తెల్పిన సిద్ధులన్నియూ, ఈ జీవునకు బంధము లగును. పైగా ఈ సిద్ధులు ముక్తి సిద్ధికంటె హీనమైనవి. ప్రలోభమును కలిగించి చెడ్డ నడత కలుగచేయునవి. అంతట నిండి ప్రకాశించు చిత్స్వరూపమునందే శ్రేష్ఠమైన ముక్తి సుఖము యుండునే తప్ప, పైన తెలిపిన సిద్ధులలో కాదు.

## వ్యాఖ్య

ఎటువంటి గొప్ప సిద్ధులైనప్పటికీ, అవన్నియు జీవునికి బంధము లిచ్చునే తప్ప, విముక్తికి దోవ చూపవు. సిద్ధులన్నియు

చిత్తము యొక్క చర్యలే యగును. చిత్తము యొక్క సంగముతో తప్ప సిద్ధులు సిద్ధించలేవు. అవి పని చేయలేవు కూడా, చిత్తము యొక్క చర్యలన్నీ జీవునికి యింకనూ బంధమునిచ్చుటచే ఇవన్నియూ జీవునికి బంధములగునని చెప్పుచున్నారు.

పైగా, ఈ సిద్ధులు ప్రలోభమును కలిగించి జీవుని చెడు మార్గములో నడిపించి హీనమైన నడత కలుగచేయును. ఇటువంటివి మనస్సులో తిరుగుచున్నప్పుడు ముక్తి సుఖము ఎట్లు కలుగును. చిత్ర భ్రమ తొలగిన చోటున ముక్తి సుఖముండునే గాని సిద్ధులతో ఊగిసలాడు మనసున మాత్రముగాదు. ఈ భావమునే గల శ్రీ భగవానుని ఉన్నది నలుబది - అనుబంధము లోని 16వ పద్యమును చూడవచ్చు.

చిత్త శాంతియెగద సిద్ధమౌ (సిద్ధమయిన) మోక్షమ్ము
చిత్త చేష్టలేక సిద్ధులున్నె?
వాని గోరువారు మానస చాంచల్య
మణంగు మోక్షసుఖము నందగలరె? ॥

ముక్తిపై ఇచ్ఛగల సాధకులు, మధ్యలో వచ్చు అనేక రకములైన ఇటువంటి సిద్ధులయందు మనస్సు నిలిపినచో, దానివల్ల ఫలము అహంకారము గట్టిపడుటయే తప్ప, బంధ నివృత్తి కొంచెమైననూ లేదు. జీవునకు బంధములగును అని చెప్పుటలోని భావమిదియే. చిత్స్వరూపములో తప్ప వేరెక్కడా ముక్తి సుఖము లేదు యని తెలుపుచున్నారు.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

శ్రీ భగవాన్ విరూపాక్ష గుహలో వున్నప్పుడు, వారిని ఎంతో భక్తితో సేవించి భోజనమిడిన కీరపాటి (ఆకుకూరల మామ్మ), తన మరు జన్మలో గోవు లక్ష్మిగా జన్మించి ఆశ్రమ వాసి ఐనదని, ఇతర భక్తులతో బాటు నేను కూడా నమ్ముతాను.

శ్రీ భగవాన్‌తో వున్నంత కాలమూ, నేను ప్రశాంతంగా నిర్భయంగా వుండేవాడిని. వారి సన్నిధి మహిమ అట్టిది. ఈ అనుభవాన్ని చాలా మంది భక్తులు ధృవీకరిస్తారు. అయినప్పటికీ, అప్పుడప్పుడూ మనస్సు అలజడికి గురియై ప్రశాంతత కోల్పోయే వాడిని. ''ఇలా యెందుకు జరుగుతుంది? దీని అర్థము శ్రీ భగవాన్ అనుగ్రహము కోల్పోయామనియా?'' అని శ్రీ భగవాన్‌ను ప్రశ్నించాను. శ్రీ భగవాన్ అపారమైన కరుణతో, వాత్సల్యంతో ఇలా జవాబిచ్చారు: ''పిచ్చివాడా! అనుగ్రహం వల్లెనే నీకు అశాంతి, ఇబ్బందులూ తెలుస్తున్నాయి.''

మరో సందర్భంలో శ్రీ భగవాన్ నాతో యిలా అన్నారు. ''మీరు మంచివి అనుకున్నవి జరిగినప్పుడు మీరు సంతోషించి భగవంతుని పట్ల కృతజ్ఞత ప్రదర్శిస్తారు. అంతవరకూ బాగానే వుంటుంది. కానీ మీరు చెడు అనుకునేవి జరిగినా అంతే కృతజ్ఞత ప్రదర్శించాలి. అక్కడే అందరూ కృతార్థులు కాలేరు.

శ్రీ భగవాన్ ఉపదేశాలలో మనకు ప్రత్యేకముగా కనిపించేది వారి సమత్వ భావము. ఇది వారి ఉపదేశమే కాదు. దైనందిన జీవితంలో వారు మాటల కంటే చేతులతో పాటించి చూపించే సమత్వము. అందరినీ ఒకే దృష్టితో చూడాలనేది శ్రీ భగవాన్ బోధన. మనుషులే కాదు, జంతువులు, అన్ని జీవరాశులు భగవత్ స్వరూపాలే అన్న సత్యాన్ని శ్రీ భగవాన్ జీవించి చూపించారు. శ్రీ భగవాన్ సమ దృష్టి గురించి ఒక గ్రంథము రాయవచ్చును. మనుషులను యెలా చూశారో, అంతే సమానంగా వారు కోతులనూ, ఉడతలనూ, నెమళ్లనూ, పక్షులనూ, జింకలను, కుక్కలనూ, పిచ్చుకలనూ, పులిపిల్లలను కూడా ప్రేమించేవారు. ఆ ఉదాహరణలను యిక్కడ నేను ప్రస్తావించను. కేవలం సమత్వ భావాన్ని వారు జీవించి చూపించారు అని చెప్పి ముగిస్తాను. వారి సన్నిధిలో అందరూ ఒక్కటే -పెద్దలూ, పిన్నలూ, శ్రీమంతులూ, పేదలూ, పురుషులూ, స్త్రీలూ, మానవులూ, జంతు జాతీ -

అందరినీ తామెలా సమంగా చూసే వారో, భక్తుల నుండి కూడా ఆ సమత్వమే ఆశించేవారు శ్రీ భగవాన్. తన పట్ల ఎటువంటి ప్రత్యేకత చూపినా సహించే వారు కాదు. భోజన సమయంలో కానీ, వేరు సమయాలలో కానీ ఇతరుల కంటే తమకు ఏ మాత్రం ఎక్కువ వడ్డించినా వడ్డించే వాళ్ళపట్ల మండిపడేవారు. ఇలా చేయడం వల్ల తనను అవమానపరుస్తున్నారని మందలించేవారు శ్రీ భగవాన్. ‘‘ఇంతకంటే అవమానముండదు,’’ అనేవారు.

ఆశ్రమ నియమాలను, నిబంధనలనూ అందరూ తప్పకుండా పాటించాలని శ్రీ భగవాన్ కోరేవారు. నిజంగా ఏమైనా మంచి కారణం ఉంటే తప్ప ఎవ్వరూ వాటిని భంగపరచడం ఆమోదించే వారు కాదు. తాము మట్టుకు ప్రతి నియమమూ, నిబంధనా తూ,చా తప్పకుండా పాటించే వారు శ్రీ భగవాన్.

ఆలోచనా రహితంగానూ, మొండిగానూ నియమాలను అమలు పరచడం శ్రీ భగవాన్‌కు యిష్టం వుండేది కాదు. ఈ కింది సంఘటన ఒక ఉదాహరణ.

ఒక మధ్యాహ్నం ముగ్గురు ఐరోపా దేశస్థులు ఆశ్రమానికి వచ్చారు - ఒక బ్యాంకు ఉద్యోగి, యిద్దరు స్త్రీలు. పాత హాలులో శ్రీ భగవాన్‌కు ఎదురుగా ఉత్తరపు గోడనానుకొని దక్షిణాభిముఖంగా కూర్చున్నారు. ఒక స్త్రీ నేలమీద కూర్చొవడం అలవాటు లేక, కాళ్ళు చాచుకొని కూర్చున్నారు. శ్రీ భగవాన్ పరిచారకుడొకరు, ఆమె అలా కూర్చొనడం శ్రీ భగవాన్ పట్ల అమర్యాదకరమైనదిగా భావించి, ఆమెను కాళ్ళు ముడుచుకొని కూర్చోమని సూచించారు. పాపం! ఆమె చాలా బాధ పడ్డారు. శ్రీ భగవాన్ పట్ల పూజ్యభావం ప్రదర్శించ డానికి వచ్చిన వారి పట్ల తను అమర్యాదకరంగా ప్రవర్తించానని తెలుసుకొని చాలా చిన్నబోయారు. దాదాపు కళ్ళ నీళ్ళ పర్యంత మయ్యారు. శ్రీ భగవాన్ మన హృదయాలను చూస్తారు కానీ, మన చేష్టలను కాదు. ఆమెకు కలిగిన మనస్తాపం చూసి చాలా బాధపడ్డారు. ఆమెకు అలవాటు లేనందున, కాళ్ళు చాపుకొని

కూర్చొనడంలో తప్పులేదని వారిని ఓదార్చారు. కానీ ఆమె మళ్ళీ కాళ్ళు చాచుకోవడానికి ఒప్పుకోలేదు. శ్రీ భగవాన్ కూడా, తమకున్న కీళ్ళ నొప్పుల వల్ల సోఫా మీద కాళ్ళు చాచుకొనే కూర్చొనేవారు. ఎక్కువ సేపు కాళ్ళు ముడుచుకొని కూర్చోలేకపోయేవారు. కానీ యీ సంఘటన తరువాత లేచి కూర్చొని కాళ్ళు ముడుచు కొన్నారు. ఎంత నచ్చ చెప్పినా వారు కాళ్ళు చాచుకోలేదు. "ఆమెకు పెట్టిన నియమమే అందరికీ వర్తిస్తుంది. నేను కూడా కాళ్ళు చాచుకోకూడదు" అన్నారు.

బుద్ధిహీనుడైన ఒక పరిచారకుని మాట పట్టించుకోవద్దని మేమెంత బ్రతిమాలినా శ్రీ భగవాన్ తన పట్టు విడవలేదు. నాకు గుర్తున్నంత వరకూ మరుసటి రోజున మా మాటమన్నించి కావలసి వచ్చినప్పుడు కాళ్ళు చాచుకోవడం మొదలు పెట్టారు శ్రీ భగవాన్.

శ్రీ భగవాన్ ఉపదేశాలలోని అతి విశిష్టమయిన విశేషాలలో ఒకటయిన ఈ విశేషాన్ని, నాకు వీడ్కోలు ఉపదేశంగా భావిస్తాను. శ్రీ భగవాన్ ఆరోగ్యం క్షీణిస్తున్నది అని విని 1947 ఏప్రిల్ 27న నేను ఆశ్రమం చేరుకున్నాను. మూడు వారాలు అచ్చటవున్న తరువాత, మే 18న తిరిగి వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడనౌతున్నాను. బయలుదేరేముందు రోజు, నేను చాలా నిరాశా నిస్పృహలలో కూరుకు పోయాను. శ్రీ భగవాన్ నాకు చేయవలసినదంతా చేయకుండా, ఇతనిని బాగు చేయడం సాధ్యం కాదని నాపాటికి నన్ను వదిలి వేశారనుకున్నాను. ఆ మానసిక స్థితిలో వున్న నేను, ఒక రోజు మధ్యాహ్నం 3 గంటలకు, శ్రీ భగవాన్‌తో ఇలా అన్నాను: "భగవాన్ నా మానసిక పరిస్థితిని సరిగా వర్ణించే కొన్ని పాటలు

నేను పాడతాను. భగవాన్ కరుణించి వాటిని శ్రద్ధగా వినాలి''. అలా చెప్పి, నేను శివప్రకాశం పిళ్ళే గారి మూడు పాటలు పాడాను. వాటి అర్థము ఇలా వుంటుంది.

''మనము ఎన్ని ప్రణాళికలు వేసినా, భగవంతుడనుగ్రహం లేకపోతే ఏదీ సఫలీకృతము కాదని మీరు బోధించారు. అందువలన, శ్రేష్ఠమయిన భక్తుడు ఎటువంటి ప్రణాళికను తయారు చేయడని మీరు చెప్పారు. అయిననూ మీ బోధన నా హృదయానికి హత్తు కోక మనస్సును నిగ్రహించుకోలేకపోయాను''.

''నా అదృష్టం వలన దొరికిన ఉత్కృష్టులైన గురువు మీరు. కానీ మీ బోధనను నేను పాటించలేదు. ప్రపంచము మీద వ్యామోహము నాకింకా పోలేదు. అశాశ్వతమయిన ఈ దేహము 'నేను' కాదు అనే సత్యాన్ని నాకు మానసికంగా మీరు తెలియ పరిచారు. కానీ యీ సత్యాన్ని నేను నిజ జీవితంలో ప్రత్యక్షంగా అనుభవైక్యము చెందేటట్లు నాకు మీరు కలగ చేయలేదు. నిజమైన యజమాని, తన బానిసను నియంత్రించి, రక్షించాలి కానీ జుగుప్సతో బాగు చేయలేని స్థితిలో నన్ను వదిలి వేయకూడదు''.

''నన్ను మీరిలాగే, నా మానాన నన్ను వదిలి వేస్తే నేనేమై పోవాలి? బలహీనుడనైనందున నన్ను నేను సంస్కరించుకోలేను. నా నాథులైన మీరు నన్ను బాగు చేయరు. ఈ జీవితంలో గానీ, వచ్చే జీవితంలో గానీ, మీరు తప్పితే నాకు వేరు సహాయం ఎక్కడిది? నిజం చెప్పండి. మీరు నన్ను యేమి చేయదలచు కున్నారు? ఇది మీకు న్యాయమా?

ఈ నా హృదయ పూర్వక ప్రార్థన విన్న శ్రీ భగవాన్, ఒకటి రెండు నిమిషాలు మౌనంగా వుండి, తమ అపారమైన కరుణతో

యిలా అన్నారు. "నేనేమి చేసినా, చేయకపోయినా, నీవు శరణాగతి చెంది మాట్లాడకుండా వుండ వచ్చునే!".

నా మట్టుకు నేను, ఆత్మ సాక్షాత్కారం కొరకు గానీ, ముక్తి కోసం కానీ అవలంబించిన పద్ధతి ఒక్కటే. శ్రీ భగవాన్ పాదాలను ఆశ్రయించి, నాకు చేతనయినంతగా వారి శరణాగతి పొంది, మొత్తము శ్రీ భగవాన్‌కు వదలి వేయటమే. శ్రీ భగవాన్ మహా సమాధి చెందే ముందు, వారు నా కొసగిన ఉపదేశ మొక్కటే! "నీవు చేయాల్సింది ఒక్కటే. భారమంతా నా మీద వేసి శరణు పొందడమే. పూర్తి శరణాగతి పొందినప్పుడు, గురువు ఇది చేయలేదు, అది చేయలేదు అనడానికి ఆస్కారముండదు".

నాకుగానీ, ఇతరులకు గానీ, శ్రీ భగవాన్ యొక్క ఈ బోధన నూతనమైనది యేమీ కాదు. కానీ ఆ సందర్భములో శ్రీ భగవాన్ అన్న మాటలు నాకు పూర్తిగా తృప్తినిచ్చాయి. శ్రీ భగవాన్ నన్ను రక్షించాలనే సంకల్పముతోనే ఆ మాట అన్నారన్న నమ్మకం నాకు సంపూర్ణముగా కలిగింది. బాహ్యముగా ఎలాంటి చిహ్నములు కనిపించిననూ శ్రీ భగవాన్ నన్ను పూర్తిగా రక్షిస్తున్నారనే మాట తథ్యము.

నేను ఈ విషయంలో ఎటువంటి ఆందోళన, ఆదుర్దా చెందడం, నిరాశ, నిస్పృహలకు గురి అవ్వడం నా మూర్ఖత్వమవుతుంది. నాకూ, మరెందరో భక్తులకూ, శ్రీ భగవాన్ సాక్షాత్తు పరమేశ్వరుడు. మా సర్వమూ వారే. శ్రీ అరుణగిరినాథర్ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఉద్దేశించి ఇలా పాడారు, "నేను మిమ్మల్ని తప్పించి ఇతరులు ఎవరి మీద ఆధారపడను. నేను మిమ్మల్ని తప్పించి ఇంకెవరినీ అనుసరించను". ఈ పాటను నేను శ్రీ భగవాన్

సన్నిధిలో చాలా సార్లు పాడాను. ఆఖరి రెండు పంక్తులలో 'మురుగా' బదులు 'భగవాన్' అని మార్చేవాడిని. మేము ఎవరి గురించి పాడినా, యే ప్రదేశాలు సందర్శించినా, ఏ మూర్తులను పూజించినా మా ప్రార్థనలన్నీ శ్రీ భగవాన్‌కే! ఈ అధ్యాయాన్ని ఒక కథతో ముగిస్తాను.

నేను చిత్తూరు వదిలి ఆశ్రమంలో స్థిర నివాసం ఏర్పరచుకునే సరికి, నా దగ్గర ఒక హుండీలో 70 రూపాయలు వున్నవి. అవి, అనేక తరాలుగా మా కులదైవమయిన శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి కట్టిన ముడుపు ధనం. నాకొక ఆలోచన వచ్చింది. ఆ డబ్బును తిరుపతి స్వామిని దర్శించడానికి వినియోగించినా, కుటుంబంతో సహా శ్రీ భగవాన్‌ను దర్శించడానికి వినియోగించినా ఒక్కటే ననిపించింది. భగవంతుడొక్కడే! శ్రీ రమణాశ్రమంలో మానవ రూపంలో వున్నా, తిరుపతిలో మూర్తి రూపంలో వున్నా ఆ దేవదేవుడొక్కడే. శ్రీ భగవాన్ భక్తులొకరు తిరుపతిలో స్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మూర్తికి బదులు శ్రీ భగవాన్ దర్శన మిచ్చారట! కానీ నా భయం నాకున్నది. చాలా మంది చదువరులకు కూడా యీ సంగతి తెలిసి వుంటుంది. స్వామి వారి మొక్కును తీర్చకపోతే చాలా తీవ్రమైన పరిణామాలుంటవన్నది లోకోక్తి. తెలిసి చేసినా, తెలియక చేసినా మొక్కు తీర్చకపోతే కష్టాలు తప్పవనేది అందరి నమ్మకం. అందువల్ల శ్రీ భగవాన్‌కు చెప్పకుండా నేనెటువంటి చర్యా తీసుకోదలుచుకోలేద. అందువల్ల, ఒకరోజు శ్రీ భగవాన్‌తో నా మనస్సులో మాటను, - ''జయంతికి కుటుంబ సభ్యులనందరినీ శ్రీ భగవాన్ దర్శనానికి తీసుకురావడానికి హుండీలో పైకం ఖర్చు

పెట్ట దలచుకున్నానని'' నివేదించాను. శ్రీ భగవాన్ వాగ్రూపంలో కాకపోయినా, చిరునవ్వుతో తలవూపి తమ సమ్మతి తెలియపరిచారు.

ఈ సందర్భంలో, నేపాల్ త్రిచేంద్ర కాలేజి ప్రిన్సిపాల్‌గారయిన రుద్రరాజ్ పాండే గారికి అరుణాచలేశ్వరాలయంలో కలిగిన అనుభవాన్ని తెలియపరుస్తాను. ఈ అనుభవం గురించి వారు శ్రీ భగవాన్ స్వర్ణోత్సవ సంచికలో ఈ విధంగా ప్రస్తావించారు. ''గర్భగుడి తలుపులు తీశారు. నా గైడు నన్ను లోపలకు తీసుకువెళ్ళాడు. గర్భగుడిలో చీకటిగా వుంది. మా ముందు కొద్ది గజాల దూరంలో ఒక ప్రమిదలో దీపం మిణుకు మిణుకు మంటోంది. నా సహచరుడు 'అరుణాచలా' అని గట్టిగా అరిచాడు. నా దృష్టి అంతా గర్భగుడిలో శివలింగాన్ని చూడటం కోసం నిలిచివుంది. కానీ, ఆశ్చర్యం! శివలింగానికి బదులు, నాకు భగవాన్ రమణ మహర్షి దర్శనమిచ్చారు. వారి మందహాస వదనం నా యెదురుగా వున్నది. తళతళలాడే వారి కళ్ళు నా వైపే చూస్తున్నవి. ఇంకా ఆశ్చర్యం. నేను చూసేది ఒక్క మహర్షిని కాదు. కొన్ని వందల మహర్షి ముఖాలు నాకు గోచరమయ్యాయి. అదే చిరునవ్వు! అవే మెరిసే కళ్ళు! గర్భగుడిలో నేనెటు చూసిన అవే దృశ్యాలు. నేను అరుణాచలేశ్వరుని చూడడానికి గుడికి వెడితే, నాకు సజీవ దైవము కరుణతో దర్శనమిచ్చారు.''

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

## స్వామి లక్ష్మణ జూ

మల్లాది ఫణిమాల

స్వామి లక్ష్మణ జూ కాశ్మీర్ ప్రాంతానికి చెందినవారు. ఆయన కాశ్మీర శైవ సిద్ధాంతాన్ని గురించి అనర్గళంగా సాధికారంగా ప్రవచించ గల మహా గొప్ప పండితునిగా ప్రఖ్యాతి గాంచారు. వారి తండ్రి గారు శ్రీ నారాయణ దాస్ రైనా మరియు తల్లిగారు అర్న్యామలి రైనా. వీరిద్దరు మంచి శివ భక్తులు. కాశ్మీర్‌లో హౌస్ బోట్లు ప్రవేశ పెట్టినది శ్రీ నారాయణ దాస్ రైనా. తొలిసారిగా ఆధ్యాత్మికతను గురించి శ్రీ లక్ష్మణ జూ గారికి ఐదు సంవత్సరాల వయసులో వారి అన్నగారైనటువంటి శ్రీ మహేశ్వర నాథ్ గారు తెలియజేశారు. లక్ష్మణ జూ గారికి ఎనిమిదవ ఏడు వచ్చేవరకు వారి ఆధ్యాత్మిక పురోభివృద్ధి, వారి కుల పురోహితులైన స్వామి రామ జూ గారి పర్యవేక్షణలో కొనసాగింది. 19వ సంవత్సరములో స్వామీ లక్ష్మణ జూ గారికి ఆత్మసాక్షాత్కరించిందని అంటారు.

స్వామి లక్ష్మణ జూ గారు 20 సంవత్సరాలు దాటిన తరువాతి దశకంలో భగవాన్ శ్రీరమణ మహర్షుల వారి గురించి ఎవరో చెప్పగా విని, వెంటనే అరుణాచలానికి ప్రయాణమయ్యారు. తొలిసారి శ్రీ రమణాశ్రమంలోకి అడుగుపెట్టిన లక్ష్మణ జూ హాలు లోకి ప్రవేశిస్తూనే సోఫా మీద కాళ్లు చాచుకుని ఉన్న శ్రీరమణులను దర్శించుకుని మంత్రముగ్ధులయ్యారు. ఏదో తెలియని ఆనందం

స్వామి లక్ష్మణ జూ హృదయాన్ని ముంచెత్తేసింది. తమకి ఎదురుగా కూర్చోమని శ్రీ రమణులు సెలవిచ్చారు. వారి ఎదురుగా కూర్చుని వారి చరణకమలముల వైపే తదేకంగా చూస్తూ ఉండిపోయారు స్వామి లక్ష్మణ జూ!!

శ్రీ రమణుల మౌనం స్వామి లక్ష్మణ జూను ఎంతగానో ఆకట్టుకుంది. మహర్షుల వారి మందస్మిత దరహాసము వారిని ఆనందమయ సమాధ్యవస్థలో మునిగేలా చేసింది. మహర్షి సన్నిధాన గడిపిన ఆ రోజులు దివ్య దినాలనియు, జ్ఞాన కాంతిని విరజిమ్మే వారి సన్నిధిలో ఉండటమే ఆనందదాయకమనియు, సంతృప్తికరమనియు, స్వామీ లక్ష్మణ జూ భావించేవారు.

స్వామి లక్ష్మణ జూ రమణులతో కలిసి అనేక పర్యాయములు అరుణగిరి పైకి వెళ్లడం జరిగింది. అలా అరుణగిరి పైకి శ్రీ రమణులతో కలిసి వెళ్ళినప్పుడల్లా శ్రీ రమణులు ఒక బండపై కూర్చునేవారు. వారి పాదాల వద్ద స్వామి లక్ష్మణ జూ కూర్చునేవారు. వారు ఒక రోజు శ్రీరమణుల పాదాల వద్ద కూర్చుని ఉండగా ఒక భక్తుడు, శ్రీరమణుల ఫోటో తీస్తానని వారిరువురిని సమీపించాడు. అప్పుడు భగవాన్ లక్ష్మణ జూను ఉద్దేశించి, ‘‘లక్ష్మణ జూ! ఇలా వచ్చి నా పక్కన కూర్చో! వారెవరో మన ఫోటో తీస్తారట!’’ అన్నారు. ఇలా భక్తులపై వారి వాతల్స్యవర్షాన్ని కురిపించి వారి కరుణకు అనుగ్రహానికి పాత్రులుగా చేసే శ్రీ రమణుల కృపను వర్ణించడం వారి వల్ల కాదని స్వామి లక్ష్మణ జూ అంటూ ఉండేవారు.

3 ఏప్రిల్, 1980లో ప్రచురించబడిన 'మౌంటెన్ పాత్' సంచిక స్వామి లక్షణ జూ చేతికి చేరినప్పుడు ఆ సంచికలో వారు ఒక గ్రూప్ ఫోటోని గమనించారు. ఆ ఫోటోలో స్వామి లక్ష్మణ జూ శ్రీ రమణుల పక్కనే కూర్చుని ఉండడం గమనించారు. వారి ఆనందానికి అవధులు లేకపోయాయి. అదే ఫోటోలో ఎలినార్ పాలిన్ నోయ్ కూడా ఉన్నారు. శ్రీ రమణులు స్వామి లక్ష్మణ జూను తన పక్కన కూర్చోబెట్టుకోవడాన్ని గమనించిన ఎలినార్ పాలిన్ నోయ్ ఆనంద భాష్పాలు కార్చారు. శ్రీవారి కరుణ, కృప అంతులేనివి. ఇలా అనేక సందర్భాలు స్వామీ లక్ష్మణ జూ కు ఎదురవుతూనే ఉండేవి. వారి పట్ల శ్రీ రమణులకు ఉన్న అక్కర, ప్రేమ వారి అనుగ్రహపు నీడలో గడిపిన ప్రతి నిమిషాన్ని సువర్ణమయంగా మార్చివేసేవి. శ్రీరమణుల దివ్య సన్నిధానాన గడిపిన దినాలన్నీ కూడా సువర్ణమయాలే...

ఒకనాడు శ్రీ రమణుల సన్నిధిన ఏకాంతముగా స్వామి లక్ష్మణ జూ ఉండగలిగారు. వారి దివ్య సాన్నిధ్యాన శ్రీ లక్ష్మణ జూ అంతులేని ఆనందాన్ని చవి చూశారు. ఇట్టి ఆనందము, శ్రీరమణులను కొనియాడుతూ 5 భక్తిమయ శ్లోకాలుగా రూపుదిద్దు కుంది. ఆ ఐదు శ్లోకాలను స్వామి లక్ష్మణ జూ శ్రీ రమణులకు సమర్పించారు. ఆ శ్లోకాల యొక్క భావము ఇప్పుడు చూద్దాం.

శరీరాలు నాలుగు రకాలు. స్థూల, సూక్ష్మ, కారణ శూన్యములు. వీటికి అతీతమైనది సర్వజ్ఞమైన పరమాత్మగా

కొనియాడబడేది. అరుణాచలం కొండలన్నిటిలోకెల్లా పరమోత్కృష్ట మైనది. అరుణాచలమే తానై సదా ఆత్మనిష్ఠలో ఉండే శ్రీ గురు రమణులను ధ్యానింతును. పరమాత్మ స్వరూపులైన శ్రీ రమణ పాదముల నాశ్రయించి తరింతును. శ్రీ రమణ నామమును నిరంతరము జపింతును. దివ్యమైన వారి రూపమును చింతింతును. శ్రీ రమణులకు హృదయపూర్వక వందన మాచరింతును.

స్వామి లక్ష్మణ జూ ఈ శ్లోకాలను రచించి వాటిని శ్రీ రమణుల దివ్య చరణాల యొద్ద సమర్పించారు. శ్రీ రమణులు ఆ శ్లోకాలను చదివి ఎంతో సంతోషంతో వారి చుట్టూ ఉన్న భక్తులకు ఆ శ్లోకాల యొక్క భావమును విశదపరిచారు. చల్లటి వెన్నెల వంటి శ్రీరమణుల దివ్య సన్నిధి, దయతో నిండిన వారి వీక్షణము, కరుణను వెదజల్లే వారి చిరునవ్వు భక్తుల పాలిట కల్పతరువులు. భక్తుల జీవితాలకు ధన్యత నొసగుటకు వీటిని మించినవి ఉండబోవు అని స్వామి లక్ష్మణ జూ అనేవారు.

**అరుణాచలేశ్వర మహం**
**కరుణానిధి మఖిలలోకకర్తారం**
**శరణం గతోస్మి నిత్యం**
**తరణాయ భవాంబుధే ర్భ్రమణ హేతో ॥**

# Water on a Lotus Leaf

Talk 135 A

Dr K Subrahmanian

The effort everyone makes in bringing up their child is extraordinary. Because we do it day after day, we don't see how truly extraordinary it is. The love and affection each one of us has for our children is something that cannot be described in words. We worry about them and their future. We do everything that we possibly can to see that they are happy. In order to make them happy, most people sometimes even buy things that they cannot afford. They may not spend anything on themselves, but they spend money on their children in order to make them happy. This doesn't apply only to the rich. Even those who cannot afford it, borrow money to buy the child something to make it happy.

We know the likes and dislikes of our children. We want to please our children as much as we possibly can. We have the feeling that because of what we do for them, and because of our affection for them, we really love them. We also believe they love us as well, and therefore, will not do anything against our wishes.

The children grow up as individuals. We think of it only as physical growth, and don't pay much attention to their mental growth because it is difficult to detect. Therefore, sometimes we are astonished when our daughter or son says something we could have never imagined them saying.

However, we still think we have control over our children, and we continue to shower our affection on them.

One day, when you talk about marriage, your daughter suddenly says, “You don’t have to worry about looking for a suitable husband for me.” Initially, you think it is a joke and you try to laugh away the whole thing. However, your daughter says that she is going to marry this particular man. She continues, “You also know him. He has been coming to our house frequently.” Then you say, “I thought you were just friends!” She says, “He has been coming here frequently, so I thought you would have guessed that I am going to marry him.” You are shocked, and you say that she cannot marry the man. At this point, the daughter may even say without hesitation, “I hate you! If you don’t allow me to marry him, I won’t get married at all!” Extreme love turns to extreme hatred.

Now what happens? This is the most extraordinary thing because we see this happening all the time. The father is very upset, not because the child is disobeying him, but because he thinks of the consequences of the marriage; perhaps he knows something about the family, and feels that his daughter will not be happy in such a family. Again, it is out of interest for his daughter - there is no selfish motive in this. In such situations, it is pointless to advise parents and children to have a sense of proportion. You can’t tell the girl that her father has her interests at heart; neither can you tell the father that his daughter is not going to change her mind. Nobody can advise them because each one feels that the other is wrong. The parents wonder what

